

నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు

ఎక్సైజ్ పోలీసులు పాలకొల్లులో నకిలీ మద్యం తయారీ ముఠా గుట్టును రట్టు చేశారు. శంభునిపేటలోని పులి శీతల్ ఇంట్లో నకిలీ మద్యం తయారీపై దాడులు చేశారు. 8లో ▸



దళితులకు తగ్గిన కేటాయింపులు

ఎస్సీ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో అన్యాయం చేశారని, న్యాయం చేయాలంటూ నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మధు ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి వినతిపత్రం సమర్పించారు. 8లో ▸



సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలి

రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలని ఎన్నార్పీ అగ్రహారం కేవీకేలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. 8లో ▸

జీతాల్లేవు.. అప్పులే దిక్కు

- 4 నెలలుగా కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు అందని జీతాలు
- ఒక్కొక్కరికి రూ.45 వేల వరకు బకాయిలు
- పీఎఫ్ చెల్లింపుల సమాచారం కూడా లేదంటున్న కార్మికులు
- జిల్లాలో దాదాపు రూ.45 లక్షల బకాయిలు



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులు

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు అందక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కుటుంబ పోషణకు, ఇంటి అద్దెల కోసం అప్పులు చేసి బతకాల్సి వస్తోంది. ఒక నెల జీతం రాకపోతేనే కుటుంబ పోషణ, ఇతర ఖర్చులకు మనం ఇబ్బంది పడతాం. అలాంటిది గత నాలుగు నెలలగా జీతాలు రాకపోవడంతో వారి కష్టాలు వర్ణనాతీతం. పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రూ.45 వేల వరకూ జీతాలు బకాయిలు ఉన్నాయి. జీతం ఎప్పుడు వస్తుందో తెలియక అప్పులు చేసి ఇబ్బందుల పాలవుతున్నారు. కొందరు స్థానికంగా అద్దెకు ఉంటే మరి కొందరు సొంత గ్రామాల నుంచి రవాణా ఖర్చులు పెట్టుకుని వచ్చి డ్యూటీలు చేస్తున్నారు. నెల జీతం వస్తుందని ముందుగానే అప్పులు చేయడంతో వడ్డీ పెరిగి భారంగా మారుతుందని కార్మికులు వాపోతున్నారు. నెల నెల తమకు జీతాలు చెల్లిస్తే అప్పుల బాధలు తప్పుతాయని చెబుతున్నారు. నెలకు అసలు జీతం రూ.16 వేలు కాగా మినహాయింపులు పోను రూ.11,850 వస్తోంది. పీఎఫ్ కోసం వారి జీతం నుంచి మినహాయించిన సొమ్ము కూడా పీఎఫ్ ఖాతాకు జమ అవుతుందో లేదో తెలియని పరిస్థితి.

ఏడు నెలలకోసారి.. నాలుగు నెలలకోసారి

జీతం వస్తుందనే ఆశతో కార్మికులు విధులకు హాజరై ఆసుపత్రుల్లో తమ విధులు నిర్వర్తిస్తున్నారు. జీతాలు సక్రమంగా రాక పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి ఏడు నెలలకోసారి, నాలుగు నెలలకు ఒకసారి జీతాలు చెల్లించే పద్ధతిలో చెల్లిస్తున్నారు. అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో జీతాల కోసం ఎవరిని అడగాలో తెలియడం లేదు.

100 మంది కార్మికులకు రూ.45 లక్షల బకాయిలు

పశ్చిమగోదావరి జిల్లాలో 4 ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రి, పెనుగొండ, ఆచంట, ఆకివీడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు కలుపుకుని మొత్తం 8 ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 100 మంది వరకూ పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.45 వేల చొప్పున రూ.45 లక్షల బకాయిలున్నాయి. భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, తాడేపల్లిగూడెం, తణుకు ఆస్పత్రిలో ఉండాల్సిన పారిశుద్ధ్య కార్మికులకంటే 10 శాతం తక్కువ మంది కార్మికులు పనిచేస్తున్నారు. దాంతో వారిపై పనిభారం ఎక్కువగా ఉంది.

ఆదుకున్న గత ప్రభుత్వం

గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచి ఆదుకున్నారు. రూ.6 వేలు ఉన్న జీతాన్ని రూ.16 వేలకు పెంచడమే కాకుండా కాంట్రాక్టర్ల ద్వారా క్రమం తప్పకుండా జీతాలు అందించారు. దాంతో వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేసుకునే వారు. నేడు జీతం సక్రమంగా ఇవ్వకుండా కార్మికులను చినచూపు చూస్తూ వారిచేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. రెండు నెలల జీతాలు ఇవ్వకపోతే విధులు బహిష్కరించి కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిరసనలు చేపట్టేవారు ఉన్నారు. కనీసం కలెక్టర్‌ను కలిసి జీతాలు గురించి మాట్లాడే పరిస్థితి తెలియని కార్మికులు పట్ల ఈ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణం.

నాలుగు నెలలుగా జీతాలు లేవు



నాలుగు నెలలగా జీతాలు లేవు. దాంతో బతుకుదెరువుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. జీతాలు రాకపోవడంతో ఒక పక్క అద్దె, మరో పక్క కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కొక్కరికి రూ.45 వేల జీతం బకాయి ఉంది. మా గురించి ప్రభుత్వం గానీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు.

– బి.వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య కార్మికురాలు

జీతం వస్తుందని అప్పలు చేశాం



ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న మాకు సకాలంలో జీతాలు రాకపోవడంతో అప్పులు చేసుకుని కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నాం. కార్మికులందరూ ఈ జీతాల మీదే ఆధారపడి బతుకుతున్నాం. మాకు జీతాలు నిలుపుదల చేస్తే ఎలా కుటుంబాలను పోషించుకోవాలి. మా జీతాల సమస్యను ప్రభుత్వం, అధికారులు పరిష్కరించాలి.

– ఎం.లక్ష్మి, పారిశుద్ధ్య కార్మికురాలు

పీఎఫ్ సమాచారం చెప్పడం లేదు



మాకు జీతాలతో పాటు పీఎఫ్ సొమ్ము జమవుతుందో లేదో తెలియడం లేదు. జీతాలు సక్రమంగా చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో అసలు పీఎఫ్ కటింగ్ ఉంటుందా అనే ఆందోళన మాకుంది. భవిష్యత్‌లో పీఎఫ్ సొమ్ము మాకు భరోసాగా ఉంటుందని భావిస్తున్నాము. ప్రభుత్వం పట్టించుకుని మాకు నెలనెల జీతాలు చెల్లించి పీఎఫ్ సక్రమంగా జమయ్యేలా చూడాలి.

– ఎల్.భవాని, పారిశుద్ధ్య కార్మికురాలు

గత సీజన్ పరిమితిని అనుమతించాలి



పొగాకు బోర్డు ఈడీకి సమస్యలు వివరిస్తున్న వర్జీనియా రైతు సంఘాల నాయకులు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు 2025–26 సీజన్‌కు బ్యారన్‌కు గత సీజన్‌లో అనుమతించిన పరిమితినే అనుమతించాలని వర్జీనియా రైతు సంఘాల నాయకులు కోరారు. గుంటూరు పొగాకు బోర్డు కేంద్ర కార్యాలయంలో ఈడీ బిశ్వశ్రీని వర్జీనియా వేలం కేంద్రాల రైతు సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2024–25 సీజన్‌కు సంబంధించి వేలం ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. ప్రస్తుత మార్కెట్ రైతులకు నష్టం కలిగించేలా ఉందని, వస్తున్న ధరలతో పెట్టుబడులు కూడా రావని ఈడీకి తెలిపారు. లోగ్రేడ్ పొగాకు కేజీ కూడా అమ్మలేదని రైతులు వాపోయారు. ప్రస్తుత సీజన్‌లో నష్టాల నుంచి కొంత మేరైనా గట్టెక్కాలంటే పొగాకు బోర్డు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పరిమితి పెంచకపోతే అధికంగా పండిన పంటకు పెనాల్టీలు చెల్లించాలని, అలా కాకపోతే లైసెన్సులు అద్దెకు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దీని వల్ల రైతు ఆర్థికంగా నష్టపోతాడని ఈడీకి వర్జీనియా రైతులు తెలిపారు. అనుమతి లేకుండా పండిస్తున్న పంటను పొగాకు బోర్డు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వామిశెట్టి హరిబాబు, కూచిపూడి రమేష్, సత్రం వెంకట్రావు, పెండ్యాల ప్రసాద్, కాకర్ల నంది, దుగ్గిరాల బోస్, ఇల్లూరి రాంబాబు, పిన్నమనేని మధుమోహన్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

న్యూస్‌రీల్

నగదు పరపతిని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): చేనేత సహకార సంఘాలు తమ సభ్యులకు నిరంతరం ఉపాధి కల్పించేందుకు డీసీసీబీ నగదు పరపతిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో 2025–26 సంవత్సరానికి చేనేత సహకార సంఘాలకు నగదు పరపతి మంజూరుకు ప్రతిపాదనలపై చర్చించి డీసీసీబీ బ్యాంకుకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి రూ.119.98 లక్షలు 15 చేనేత సహకార సంఘాలకు అందించేందుకు నగదు పరపతి ప్రతిపాదనలను సిఫారసు చేశామన్నారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ ఉప సంచాలకులు బి.ధనుంజయ రావు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేస్తే చర్యలు



భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: ఆకతాయిల చేష్టలను సోషల్‌మీడియాలో గంజాయి, మద్యం సేవించి హల్‌చల్ చేశారంటూ జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని, ఈ విధంగా అసత్యప్రచారం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి స్పష్టం చేశారు. మంగళవారం భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతూ.. ఒక గొడవ విషయంలో అరెస్టయిన ముద్దాయిలు.. నిందితులు గంజాయి, మద్యం వంటివి సేవించలేదని, వారిపై గతంలో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవన్నారు. మీడియాలో గంజాయి, మద్యమంటూ ప్రచారం చేయడంతో విద్యాశాఖామంత్రి దృష్టికి వెళ్లిందన్నారు. మంత్రి ఆదేశాల మేరకు నిందితులు, వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామని, భవిష్యత్తులో ఇలాంటి ఆకతాయి పనులు చేయవద్దని హెచ్చరించినట్లు చెప్పారు.

విద్యా సామగ్రి విక్రయాలను అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ



భీమవరంలోని భాష్యం స్కూల్లో విద్యా సామగ్రి ఉన్న గదిని సీజ్ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా భాష్యం–1 స్కూల్లో విద్యా సామాగ్రి అమ్మకాలు చేస్తుండగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ మాట్లాడుతూ పట్టణంలో పలు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యాసామాగ్రి అమ్మకాల రూపంలో పెద్ద మొత్తంలో దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలు, ఇతర సామగ్రిని తమ వద్దనే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తూ ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నారన్నారు. భాష్యం స్కూల్ అక్రమ వ్యాపారం విషయం విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేయడంతో పుస్తకాలు నిల్వచేసిన గదిని సీజ్ చేశారు.

26న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరు(మెట్రో): ఈ నెల 26న ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ శ్రీహరి తెలిపారు. ఈ నెల 26న గురువారం ఉదయం 10:30 గంటలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్‌కు సంబంధించి 1 నుంచి 7 వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తారన్నారు.

డీఎస్సీ పరీక్షకు 80.33 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని అయిదు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షకు 80.33 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. సెషన్ 1లో 584 మందికి 482 మంది హాజరు కాగా, సెషన్–2లో 585 మందికి 458 మంది హాజరయ్యారు. సెషన్ 3లో 584 మందికి 469 మంది హాజరయ్యారని ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నారాయణ తెలిపారు.

జీవో నంబర్ 5 సవరించాలి



కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కొయ్యలగూడెం: ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు సంబంధించి జారీ చేసిన జీవో నెంబర్ 5ను సవరించాలని ఉద్యోగులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల విషయంలో అర్బన్ ఏరియాలో ఒక విధంగా, రూరల్ ప్రాంతాలలో మరో విధంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఉందని ఆరోపించారు. అర్బన్ ప్రాంతాల్లోని ఉద్యోగులకు స్థానికంగానే ఉండి ఉద్యోగం చేసుకునేలా వెలుసుబాటు కల్పించారని, రూరల్ ప్రాంత ఉద్యోగులకు మొండి చేయి చూపించారన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రామ సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో పనిచేసుకునే అవకాశం కల్పించాలని, ప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియలో మిగులు సిబ్బందిని ఏం చేస్తారో తెలియచేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్స్ ఫస్ట్, ట్రాన్స్‌ఫర్ నెక్స్ట్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు.

కొనసాగుతున్న ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



తాడేపల్లిగూడెం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలో భాగంగా జేఏసీ పిలుపు మేరకు పట్టణంలో సమ్మె మంగళవారం కొనసాగుతుంది. రిలే దీక్షల శిబిరం వద్ద నాయకులు, కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శిబిరం నుంచి ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు మద్రిపూడి సతీష్ కుమార్, అవిడి కుమార్, ఎర్రంశెట్టి నాగేశ్వరరావు, బండారు శ్రీను, అద్దాల చలపతి, ప్రత్తి రమేష్, ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు, సిబ్బంది, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ ధర పతనం

- పదిరోజుల వ్యవధిలో టన్నుకు సుమారు రూ.2 వేలు తగ్గిన రేటు
- దిగుమతి సుంకం తగ్గడంతో ధరలు పతనం
- ఆందోళనల్లో ఆయిల్‌పామ్ రైతులు
- సీజన్‌లో మరింత పతనమవుతాయని ఆందోళన
- రాష్ట్రంలో అత్యధిక సాగు విస్తీర్ణంలో ఏలూరు జిల్లా ప్రథమం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: కోకో ధరలు మాదిరిగానే ఆయిల్‌పామ్ ధరల పతనం ప్రారంభమైంది. గతేడాది నిలకడగా కొనసాగిన ధరలు నేడు పూర్తిగా తిరోగమన బాట పట్టాయి. పది రోజుల వ్యవధిలోనే టన్నుకు రూ.2 వేల మేర తగ్గింది. ఈ ధర మరింత తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుమతి సుంకం తగ్గింపు ప్రభావం ధరలపై పడటంతో అంతిమంగా అన్నదాత నష్టపోతున్నాడు. పది రోజుల క్రితం వరకు రూ.20,290 పలికిన టన్ను ధర రూ.18,650కు చేరింది. రాష్ట్రంలోనే ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంలో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరల ఆధారంగా ఆయిల్‌పామ్ ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతుంటాయి. అంతర్జాతీయంగా ఆయిల్‌పామ్‌కు మంచి డిమాండ్ ఉన్నా కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఇతర పరిస్థితులతో రైతు పూర్తిగా నష్టపోతున్నాడు. గతేడాది వరకు ఆయిల్‌పామ్ దిగుమతిపై 27.50 శాతం దిగుమతి సుంకం ఉండటంతో దేశీయ సాగు విక్రయాలపైనే నూరు శాతం ఆధారపడి డిమాండ్‌ను బట్టి దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 27.50 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని 17.50 శాతానికి తగ్గించారు. దీన్నే అదునుగా భావించి మార్కెట్‌లో కంపెనీలు, వ్యాపారులు ధరలు తగ్గించుకుని కొనుగోళ్లకు తెరదీశారు. వారానికి సగటున టన్నుకు వెయ్యి మేర పతనమవుతూ రెండు వారాల్లోనే రూ.2 వేల మేర పతనమైంది. 2023లో రికార్డు స్థాయిలో రూ.23 వేలు పలికిన ఆయిల్‌పామ్ టన్ను ధర ప్రస్తుతం రూ.18 వేలకు చేరింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గోదావరి పరివాహక ప్రాంతం కావడంతో గాలిలో తేమ శాతం కొంత మేర అధికంగా ఉండటంతో ఆయిల్‌పామ్ సాగుకు జిల్లా వాతావరణం పూర్తిగా అనుకూలం. దీంతో గత 15 ఏళ్ళుగా ప్రతి ఏటా జిల్లాలో సాగు విస్తీర్ణం పెరుగుతూనే వచ్చింది. రెండేళ్ళ క్రితం వరకు 1.27 లక్షల ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్ సాగు ప్రస్తుతం 1.40 లక్షల ఎకరాలకు చేరింది. ఆయిల్‌పామ్ ధర పతనంతోపాటు అనుబంధ ఉత్పత్తులైన ఫైబర్, గింజ, మొలాసిస్ ధరలు కూడా పతనమవుతూ ఉన్నాయి. సగటున రూ.3 వేల వరకు అనుబంధ ఉత్పత్తులకు టన్ను ధర రావాల్సి ఉన్నా రైతుకు వెయ్యికి మించి దక్కని పరిస్థితి. దిగుమతి సుంకం ప్రభావం దీనిపై అధికంగా ఉంది.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం పరిపాలనలో ఉన్న నేపథ్యంలో ఆయిల్‌పామ్ రైతులను ఆదుకుని మద్దతు ధర కల్పించాలి. ఇప్పటికే ఆయిల్‌పామ్ ధరలు పతనమవుతున్నాయి. వాటిని స్థిరీకరించి రైతు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి. ఇంతవరకు రైతు ఎంత వరకు నష్టపోయారో నష్టపరిహార రూపంలో అందించాలి. రైతుల విషయంలో సమీక్షల పేరుతో కాలయాపన చేయకుండా త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలి.

– కే.శ్రీనివాస్, రాష్ట్ర రైతు సంఘ నేత

2022లో రికార్డు స్థాయి ధర

ఆయిల్‌పామ్ రైతులకు 2022 సువర్ణయుగంగా ప్రకటిస్తారు. రికార్డు స్థాయిలో ఎన్నడూ లేని విధంగా టన్నుకు రూ.26 వేల ధర లభించింది. ఇప్పటి వరకు కూడా ఇదే ఆల్‌టైం అత్యధిక ధర. 2017 నుంచి ఆయిల్‌పామ్ ధరల్లో పెరుగుదల ప్రారంభమైంది. 2018లో రూ.8600, 2020లో రూ.10 వేలు, 2021లో రూ.17,951, 2022లో రూ.26 వేలు, 2023లో టన్ను ధర రూ.23 వేలు ఉండగా.. 2024 మే నాటికి మళ్ళీ తిరోగమనబాట పట్టి రూ.13,180కు చేరింది. ఈ ఏడాది జనవరి నాటికి రూ.20 వేల వరకు చేరడంతో రైతు ఊపిరి పీల్చుకున్నాడు. జిల్లాలో అత్యధిక మండలాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉంది. రికార్డు స్థాయిలో ధర రావడంతో ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఉన్న కౌలు మూడేళ్ళ వ్యవధిలోనే రూ.లక్ష దాటింది. ఇప్పుడు ధర తగ్గడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 7 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. సరాసరి 8 టన్నులు విక్రయిస్తే రూ.1.48 లక్షలు ఆదాయం రాగా లక్ష కౌలు, పెట్టుబడులు రూ.60 వేలు కలిపి రూ.1.60 లక్ష ఖర్చుతో కౌలు రైతు అప్పుల్లో మునిగిపోతున్న పరిస్థితి.

నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు

భీమవరం(ప్రకాశంచౌక్): కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గృహ నిర్మాణ ప్రగతిపై మంగళవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి మండలాలవారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలు సాధించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. గృహ నిర్మాణాలలో అలసత్వం వహించే కాంట్రాక్టర్లను తొలగించి అవసరమైతే కొత్తవారిని నియమించుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులను కలిసి వారికి అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు వేగవంతం చేయాలన్నారు. మరో 15 రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేసి నివేదిక సమర్పించాలన్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు

అత్తిలి: ఆరవల్లి గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు మంగళవారం చెప్పారు. గ్రామంలో పాత గొడవల నేపథ్యంలో ఎస్సీ వర్గంలో రెండు కులాల మధ్య జరిగిన వాగ్వివాదం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లు, కత్తులతో దాడిచేసుకున్నారు. ఈఘటనలో ఒక వర్గానికి చెందిన మేడిద శ్రీను, గంటి సాయివంశీకి తీవ్ర గాయాలు కావడంతో రాజమండ్రి, ఏలూరు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు, మరో ఇద్దరు బాధితులైన పుచ్చకాయల సద్దాం హుస్సేన్, మేడపాటి పుష్పాంజలికి తణుకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మరో వర్గానికి చెందిన వారికి కూడా గాయాలు కావడంతో వారు తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రేమరాజు చెప్పారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోవడంతో ఆరవల్లి గ్రామంలో 144 సెక్షన్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

కాళ్ల: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జడ్జి రూ.10వేలు జరిమానా విధించినట్లు కాళ్ళ ఎస్సై ఎన్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గతంలో కాళ్ళకూరు గ్రామానికి చెందిన వ్యక్తిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు కాగా విచారణ అనంతరం భీమవరం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎంవీఎన్ రాజారావు సదరు వ్యక్తికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.

నేడు అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు పరీక్ష

ఏలూరు (ఆర్ఆర్‌పేట), పెదవేగి: బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు బుధవారం పరీక్షలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాసంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోఆర్డినేటర్ బీ.ఉమాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7 తరగతులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకూ, 8, 9 తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పరీక్ష రాసే బాలికలకు వట్లూరులోని బీఆర్.అంబేద్కర్ గురుకులాన్ని, బాలురకు పెదవేగి బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

బస్సు ప్రమాదంలో బాలుడి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న ఒక బాలుడ్ని ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొనటంతో తీవ్ర గాయాలు కాగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల ప్రకారం.. ఏలూరు రూరల్ పాలగూడేనికి చెందిన చాపన శివన్నారాయణ అతని కుమారుడు వాసు ఈనెల 23వ తేదీ రాత్రి ఏలూరు పాతబస్టాండ్ గేటు వద్ద నడుచుకుంటూ వెళుతున్నారు. ఇంతలో ఒక ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి బాలుడు వాసుని ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన బాలుడ్ని ఏలూరు ఆశ్రం హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బడ్జెట్‌లో దళితులకు తగ్గిన కేటాయింపులు

- చంద్రబాబు మోసం చేశారని, న్యాయం చేయాలని డిమాండ్
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ వినతి


ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటికి వినతిపత్రం సమర్పిస్తున్న నవ్యాధ్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో 2018–19 సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.2,450 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.341 కోట్లు మాత్రమే కేటాయించి దళితులను మోసం చేశారని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సొంగ మధు అన్నారు. ఎస్సీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం. ముక్కంటికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రకటించిన పథకాలు దళితుల జీవన విధానాలకు, ఉపాధికి ఎటువంటి సబంధంలేనివని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో ఇచ్చిన పథకాలు – భూమి కొనుగోలు పథకం, వ్యవసాయ పనిముట్లు, రూ.50 లక్షల వరకు బ్యాంక్ లింకుడ్ స్కీమ్స్, నాన్ బ్యాంక్ స్కీమ్స్, వనరబుల్ లోన్స్, చర్మకారులకు రుణాలు, పూర్తి సబ్సిడీ రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో ఇచ్చే రుణాలు ఉన్నాయన్నారు. వీటితో పాటు కార్లు, గూడ్స్ వెహికల్స్, క్రేన్లు, పొక్లెయినర్లు, లారీలు, ట్రాక్టర్లు ఆటోలు, పారిశుద్ధ్య వాహనాలు, ఎస్సీల సాంప్రదాయ వ్యాపారాలు, పనులకు సంబంధించిన పథకాలు ఉండేవన్నారు. అయితే ప్రస్తుత ఎస్సీ కార్పొరేషన్లో ఆయా పథకాలు లేకపోవడం, అదే సమయంలో వీరికి ఎటువంటి సంబంధంలేని వ్యాపార పథకాలు ఇవ్వడం అంటే ఎన్నికల హామీ తప్పటమే అవుతుందన్నారు. ఈ మేరకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 వేల కోట్లు ఎస్సీ కార్పొరేషన్‌కు విడుదల చేయాలని, ప్రస్తుతం కార్పొరేషన్ ప్రకటించిన స్థానంలోనే గతంలో అమలు పరచిన 27 పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మాదిగ చర్మకారులకు గతంలో రూ. 60 కోట్లు ప్రకటించిన మాదిరిగానే ప్రస్తుతం రూ.100 కోట్లు ప్రత్యేకంగా కేటాయించి చర్మకారులకు చెప్పుల షాపులు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎస్సీ నాయకుడు మాముడూరి మహంకాళి ఉన్నారు.

మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు జరిపారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో బారులుదీరి స్వామిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.2,15,016 సమకూరినట్లు ఈవో ఆర్‌పీ చందన తెలిపారు. సుమారు 1200 మంది భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాదం స్వీకరించారని ఈవో తెలియజేశారు.

దుగ్గిరాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- అధికారులు స్పందించకపోతే ఉద్యమిస్తామని వెల్లడి


దుగ్గిరాల ప్రధాన కూడలిలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి ఉన్న చెయ్యి విరగ్గొట్టిన దృశ్యం


విగ్రహానికి ఉన్న తల వెనుక భాగంలో కర్రపుల్ల గుచ్చిన దృశ్యం

పెదవేగి : ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ధ్వంసం చేశారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్షపూరిత చర్యలు, వికృత చేష్టలతో హద్దులు దాటి విచక్షణ కోల్పోయి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో దుగ్గిరాల ప్రధాన కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాల ఏర్పాటును స్థానిక కూటమి నాయకులు వ్యతిరేకించారని గుర్తుచేశారు. ప్రస్తుతం వారు అధికారంలోకి వచ్చిన తరువాత మహానేత వైఎస్సార్ విగ్రహం చెయ్యి విరగ్గొట్టి, తల వెనుక భాగంలో కర్ర పుల్ల గుచ్చి అవమానించడం నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. దీనిపై జిల్లా పోలీస్ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, వారు స్పందించి నిందితులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు చేపడతామని నాయకులు స్పష్టం చేశారు.

విగ్రహ ధ్వంసం సరైంది కాదు

దుగ్గిరాలలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ధ్వంసం ఘటనను దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఖండించారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన ఇలా విగ్రహాలు ధ్వంసం చేసే విధానం సరైంది కాదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డిని ప్రజలు దైవంగా భావిస్తారని, అటువంటి మహనీయుని విగ్రహం ధ్వంసం చేయడం హేయమైన చర్య అని అన్నారు.

నకిలీ మద్యం తయారీ గుట్టు రట్టు


నకిలీ మద్యం తయారుచేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

పాలకొల్లు సెంట్రల్: ఎక్సైజ్ పోలీసులు పట్టణంలో నకిలీ మద్యం తయారీ ముఠా గుట్టును రట్టు చేశారు. శంభునిపేటలో నివాసం ఉంటున్న పులి శీతల్ అనే వ్యక్తి ఇంటిలో నకిలీ మద్యం తయారవుతుందని వచ్చిన సమాచారంపై ఎక్సైజ్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. ఈ దాడిలో శీతల్ ఇంటిలో 130 లీటర్ల స్పిరిట్‌తోపాటు ప్రమాదకర ఎసెన్స్, నకిలీ మద్యం తయారీ యూనిట్, మద్యం సీసాలకు మూతలు బిగించే మిషన్, ఖాళీ మద్యం సీసాలు, మూతలు స్వాధీనం చేసుకున్నారు. ఈ యూనిట్ నడుపుతున్న పులి శీతల్‌ని అరెస్ట్ చేశారు. పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్ మాట్లాడుతూ నిందితుడికి స్పిరిట్, ఎసెన్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. శీతల్‌పై గుట్కా కేసు కూడా ఉందన్నారు. అమలాపురంలో ఈ ముఠాకు చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఆమె చెప్పారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు అజయ్ సింగ్, ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో పాలకొల్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్, భీమవరం స్క్వాడ్ సీఐ కల్యాణ చక్రవర్తి ఎస్సైలు రఘు, మహేష్, రమాదేవి ఈ దాడుల్లో పాల్గొన్నారు.

ఖైదీల సౌకర్యాలపై ప్రతి నెలా తనిఖీలు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి


జైలులో తనిఖీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా జైలును ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే.రత్న ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి కారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ తనిఖీలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రతి నెలా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆధ్వర్యంలో తనిఖీలు ఉంటాయని, మూడు నెలలకు ఒకసారి జిల్లా చైర్మన్ తనిఖీలు చేస్తారని స్పష్టం చేశారు. జిల్లా జైలులోని ఖైదీల వివరాలు తెలుసుకుని, ఉచిత న్యాయ సహాయం ఏర్పాటు చేస్తామన్నారు. ఖైదీల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొందడంలో సమస్యలు ఏర్పడితే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి, జైలర్ కే.శ్రీనివాసరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ పీవీఎస్. మునీశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి


ఆక్వా సదస్సులో పాల్గొన్న అధికారులు

గణపవరం: తమను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు ఆక్వా రైతులు అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మంగళవారం గణపవరం, పిప్పర, కేశవరం, సరిపల్లె, కొత్తపల్లి, ముప్పర్తిపాడు, జల్లి కాకినాడ, తదితర గ్రామాల్లో ఆక్వా రైతులకు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న రైతులు గిట్టుబాటు ధర, విద్యుత్ సబ్సిడీ, ఆక్వా జోన్ వర్తింపు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న రైతులు ఆక్వా జోన్‌లోకి మారడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు సాగులో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సదస్సులో సర్పంచ్ మూర అలంకారం, ఎఫ్‌డీవో శివ రామకృష్ణ, సహాయకురాలు షర్మిల తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానివి ఓటు బ్యాంకు రాజకీయాలు


హేతువాద సంఘం జిల్లా సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పుట్టపర్తి సత్య సాయిబాబా జయంతిని కూటమి ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా జరపాలను కోవడం ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగమేనని ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు కడలి రామాంజనేయులు విమర్శించారు. మంగళవారం స్థానిక ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవనంలో హేతువాద సంఘం నాయకుడు కోడూరి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. సైంటిఫిక్ టెంపర్‌ను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం మహిమల పేరుతో ప్రసిద్ధుడైన సత్య సాయిబాబా జయంతిని అధికారికంగా జరపాలను కోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వాలు బాబాల పట్ల చూపిన గౌరవం, మహాకవి శ్రీ శ్రీ, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, గుర్రం జాషువాల పట్ల చూపకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన హేతువాది, నటుడు అల్లం గోపాలరావు, అవయవ దాన ఉద్యమ నాయకురాలు పేరేచర్ల లక్ష్మీకాంతంలకు ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఐ నాయకుడు బండి వెంకటేశ్వరరావు, ఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, హేతువాద సంఘ నాయకులు పాల్గొన్నారు.

బాలుడి చేతి వేలు మెలి తిప్పిన టీచర్

ఏలూరు జీజీహెచ్‌లో ఎమ్మెల్సీ నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా గోపన్నపాలేనికి చెందిన వీరంకి అచ్చారావు, శ్రీదేవి దంపతుల కుమారుడు వీరంకి విహాన్ (7) స్థానిక జెడ్పీ హైస్కూల్లో 3వ తరగతి చదువుతున్నాడు. ఈ ప్రభుత్వ పాఠశాలలోని టీచర్ బాలుడు విహాన్ చేతివేలుని మెలితిప్పటంతో గాయమై వాచిపోయింది. ఇంటికి వచ్చిన బాలుడు నొప్పితో బాధపడుతూ ఉండగా తల్లి శ్రీదేవి ఆవేదనతో టీచర్ వద్దకు వెళ్లి అడగగా తానేమీ కొట్టలేదనీ, పిల్లలు కొట్టుకుని ఉంటారని చెబుతూ తమపై ఆగ్రహం వ్యక్తం చేసిందని తెలిపింది. నొప్పితో బాధపడుతున్న బాలుడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తీసుకురాగా వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. బాలుడి చేతి వేలుకు ఎక్స్‌రే తీయించి, వైద్య చికిత్స అందించారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించండి



కేవీకేలో ఎరువుల వాడకం తగ్గింపుపై మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఉండి: రైతులు అన్ని రకాల పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని మార్టేరు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ టీ శ్రీనివాస్ అన్నారు. ఖరీఫ్‌లో వరి, ఉద్యాన పంటల సంసిద్ధతపై మంగళవారం ఎన్నార్పీ అగ్రహారం కేవీకేలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పచ్చిరొట్ట, పంట మార్పిడి, జీవ ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులపైనా రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లికార్జునరావు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై కేవీకే ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వాటిని అవలంభించి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. రసాయన రువులు వాడకాన్ని తగ్గించే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహకాన్ని అందిస్తుందని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పాం, కోకో పంటను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆహార నాణ్యతకు ప్రథమస్థానం ఇచ్చి పంటలు పండించాలని కోరారు. కార్యక్రమంలో మద్రాస్ ఫెర్టిలైజర్స్ మేనేజర్ బెనర్జీ, ఎన్‌జీ రంగా యూనివర్సిటీ పరిశోధనా, విస్తరణ మండలి సభ్యుడు ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు తండ్రే.. కాటేశాడు

మారు తండ్రికి జీవిత ఖైదు విధించిన కోర్టు

ఏలూరు టౌన్: బాలికను గర్భవతిని చేసిన కేసులో మారు తండ్రికి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాల ప్రకారం ఏలూరు కొత్తపేట 12పంపుల సెంటర్ ప్రాంతానికి చెందిన ఒక వివాహిత భర్తకు దూరంగా ఉంటూ బీ.వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. ఆమె అప్పటికే గర్భవతి కావటంతో కొన్ని నెలల అనంతరం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 9 ఏళ్ల పాటు వెంకటేశ్వరరావుతో జీవించిన మహిళ మృతి చెందింది. బాలికను తనతోనే ఉంచుకున్న మారు తండ్రి వెంకటేశ్వరరావు 14 ఏళ్ల వయస్సు వచ్చిన నాటి నుంచి బాలికపై లైంగిక దాడికి పాల్పడుతుండటంతో ఆమె గర్భందాల్చింది. 2022 ఆగస్టులో జరిగిన ఈ ఘటనపై ఒక అజ్ఞాత వ్యక్తి చైల్డ్‌లైన్ 1098కు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అప్పట్లో ఏలూరు టూటౌన్ ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా, మహిళా స్టేషన్ డీఎస్పీ, ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడ్ని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. అనంతరం సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.అమర శ్రీనివాస్ వాదనలు వినిపించారు. మంగళవారం ఏలూరు జిల్లా స్పెషల్ జడ్జ్ స్పీడ్ ట్రైల్ ఆఫ్ అఫెన్స్ అండర్ పోక్సో యాక్ట్ కోర్టు న్యాయమూర్తి కే.వాణిశ్రీ నిందితుడికి జీవితఖైదు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాధితురాలికి రూ.5లక్షల నష్టపరిహారం అందజేయాలని తీర్పు చెప్పారు.

తండ్రిపై దాడికి కుమారుడి యత్నం

పెదవేగి : ఓ కుటుంబంలో ఏర్పడిన చిన్నపాటి వివాదం చివరికి తండ్రిపై కుమారుడు దాడికి యత్నం చేసేంత వరకు వెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం రామసింగవరం గ్రామానికి చెందిన రాటాలు, చంటి తండ్రి కొడుకులు. వీరి మధ్య చిన్నపాటి వివాదం తలెత్తగా చంటి తన తండ్రి రాటాలుపై చెట్లని నరికే యంత్రంతో దాడికి యత్నించాడు. అదే సమయంలో చంటి అన్న రాజేష్ అడ్డు వెళ్లడంతో అతని చేతిపై తీవ్ర గాయమైంది. స్థానికులు రాజేష్‌ను హుటాహుటిన ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పీజీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలి

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయని అధికారులపై చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 1100 కాల్ సెంటర్‌కు అందిన అర్జీల నివేదికపై మంగళవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్ నందు మున్సిపల్ సర్వే, పంచాయతీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఆర్ అండ్‌బీ, విద్యుత్, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు, సివిల్ సప్లయ్ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

తమిళనాడు సీఎం చొరవతో
మోసానికి చెక్

కంచిపట్టు చీర కొనుగోలులో మోసపోయిన వినియోగదారుడు

ఆకివీడు: కంచిపట్టు చీర అంటే మహిళలకు మక్కువ. అందుకే ఎంత ఖరీదైనా కొనేందుకు వెనుకాడరు. దీనిని అవకాశంగా తీసుకుని మోసం చేసేవారు లేకపోలేదు. ఆకివీడుకు చెందిన డి.కృష్ణారెడ్డి దంపతులు ఇలానే మోసపోయారు. అయితే తమిళనాడు సీఎం చొరవ జూపి ఆ మోసానికి చెక్ పెట్టారు. వివరాల ప్రకారం.. కృష్ణారెడ్డి దంపతులు ఈ ఏడాది మార్చిలో కంచి క్షేత్రానికి వెళ్లి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. తరువాత అక్కడ ఉన్న ఓ దుకాణంలో రెండు పట్టు చీరల్ని రూ.16 వేలకు కొనుగోలు చేశారు. ఆకివీడు వచ్చిన తరువాత స్థానిక వ్యాపారికి పట్టు చీరల విషయం చెప్పగా అవి కేవలం రూ.2 వేలు మాత్రమే ఉంటాయని చెప్పడంతో అవాక్కయ్యారు. వెంటనే జిల్లా వినియోగదారుల సంఘ అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్యను ఆశ్రయించారు. ఆయన ఈ విషయంపై కంచిలోని షాపు యజమానితో మాట్లాడగా చీరల్ని తిప్పి పంపిస్తే డబ్బు ఇచ్చేస్తానని తెలియజేశాడు. కానీ చీరలు పంపించినా డబ్బు మాత్రం పంపించలేదు. పైగా ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం చెప్పకపోవడంతో బంగారయ్య ఈ విషయాన్ని లేఖ ద్వారా తమిళనాడు సీఎం స్టాలిన్‌కు తెలియజేశారు. ఆయన స్పందించి ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా శివ కంచి పోలీస్‌స్టేషన్‌కు విషయం వివరించగా అక్కడి పోలీసులు ఆ వ్యాపారిని విచారించి, కంచి పట్టు చీరల సొమ్ము రూ.16 వేలు ఆన్‌లైన్ ద్వారా వినియోగదారుడికి పంపించారు. సీఎం స్టాలిన్ చొరవతో ఈ సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా వినియోగదారులు బంగారయ్యను సత్కరించారు.

క్లుప్తంగా

పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన పెంచుకోవాలి



సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ట్రైనింగ్ మేనేజర్ ప్రసంగిరాజు

తాడేపల్లిగూడెం రూరల్: సర్పంచ్‌లు పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ట్రైనింగ్ మేనేజర్ ప్రసంగిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం రెండవరోజు మహిళా సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రసంగిరాజు మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించే దిశగా సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు. తద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఇంటింటికి సేకరించిన చెత్తను గ్రామానికి దూరంగా కంపోస్టు యార్డుకు తరలించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సబ్ యూనిట్ అధికారిగా ఎస్.వి.సత్యప్రసాద్



తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారిగా ఎస్.వి.సత్య ప్రసాద్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ జిల్లా గోడిలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన లక్ష్మణరావు పూళ్ళ పీహెచ్‌సీకు బదిలీపై వెళ్లారు. సత్యప్రసాద్ మాట్లాడుతూ వర్షకాలం కావడంతో సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని కోరారు.

మంచిలి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి గీతాభాయ్

అత్తిలి: మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి గీతాభాయ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, వారిపనితీరు, ఫార్మసీ, ల్యాబ్, వార్డ్స్, ఆపరేషన్ థియేటర్, డెలివరీ రూం, వాష్‌రూమ్స్, శానిటేషన్ తనిఖీ చేశారు. వార్డు శుభ్రపరచడంలో అలసత్వం వహించిన శానిటరీ వర్కర్లను హెచ్చరించారు. ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కిరణ్, వైద్యసిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు.

5వ తేదీన జాతీయ లోక్ అదాలత్



అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ లోక్ అదాలత్ జూలై 5వ తేదీన మొదటి శనివారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా వెల్లడించారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, మెయింటెనెన్స్ కేసులు, మోటారు వాహన, ప్రమాద బీమా కేసులను కక్షిదారులు రాజీ పడవచ్చునని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పుపై అప్పీలు ఉండదని, కక్షిదారులు తప్పక ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రాజీ మార్గమే, రాజ మార్గమని, కేసులు రాజీ అయితే డబ్బు, సొమ్ములు ఆదా అవుతాయని వివరించారు.

బంగారం సమర్పణ



అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న ముదునూరి కైలాష్ వర్మ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి మంగళవారం భీమవరానికి చెందిన ముదునూరి కైలాష్ వర్మ 8 గ్రాముల బంగారం సమర్పించారు. అలాగే అమ్మవారికి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సచివాలయం ప్రారంభం

పాలకోడేరు: మండలంలోని మోగల్లులో ఉండి ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు మంగళవారం గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. అలాగే గంగాదేవి గుడి వద్ద నిర్మించిన సీసీ రోడ్డు, ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి అల్లూరి సీతారామరాజు మెమోరియల్ బిల్డింగ్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును, పబ్లిక్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు.

బురదమయంగా ఆరుగొలను రహదారి





తాడేపల్లిగూడెం మండలం దండగర్ర - ఆరుగొలను ప్రధాన రహదారి బురదమయంగా మారిన దృశ్యాలు

- వర్షాకాలంలో బురద... వేసవిలో బూడిదమయం
- వర్షాలకు చిత్తడిగా మారిన రహదారి
- ఆదమరిస్తే క్వారీ గోతుల్లోనే...!
- గాలిలో గ్రామాభివృద్ధి మాట...?

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను పేరు చెబితే ముందుగా గుర్తుకొచ్చేది గురుకుల పాఠశాల. ఇక్కడ చదివిన ఎంతో మంది ఉన్నత స్థాయిలో ఉన్నారని స్థానికులే చెబుతారు. అయితే, ఈ గురుకుల పాఠశాలకు వెళ్లే రహదారి మాత్రం అధ్వానంగా తయారైంది. ఇప్పటి వరకు బూడిదమయంగా ఉన్న ఈ రహదారి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రధానంగా దండగర్ర – ఆరుగొలను గురుకుల పాఠశాలకు వెళ్లే రహదారి, గురుకుల పాఠశాల నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఒక పక్క క్వారీ గోతులు, మరో పక్క రహదారి మొత్తం బురద వెరసి ఏ మాత్రం అదుపు తప్పినా క్వారీ గోతుల్లో పడక తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగొలను నుంచి దండగర్ర వంటి గ్రామాలకు వెళ్లేందుకు ఈ రహదారి దగ్గరి మార్గం. అయితే, ఈ రహదారి బురదమయంగా మారడంతో గ్రామస్తులు, చేలకు వెళ్లే రైతులు, మకాంలకు వెళ్లే పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా పరిషత్ పరిధిలో ఈ రహదారి ఉండటంతో ఈ రహదారి శాశ్వత ప్రాతిపదికన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

26న స్టేక్ హోల్డర్ మీటింగ్

తణుకు అర్బన్: ఈనెల 26వ తేదీన తణుకు పురపాలక సంఘ కార్యాలయంలో స్టేక్ హోల్డర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్ తెలిపారు. తణుకు పురపాలకసంఘ పరిధిలో మాస్టర్ ప్లాన్ తయారీ దృష్ట్యా ఉదయం 11 గంటలకు తణుకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో వివిధ శాఖల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, సీడీఎంఏ, ఆర్‌డీఎంఏ, ఆర్‌డీడీటీపీ, డీటీసీపీ అధికారులతో పాటు వివిధ రాజకీయపార్టీల నాయకులు, ప్రభుత్వ శాఖాధికారులు హాజరవుతారని వివరించారు.

గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

భీమవరం అర్బన్: గ్రామంలో తాగునీటిని ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తాగునీరు ఫిల్టర్ చేసి సరఫరా చేయాలని గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో కుళాయి ద్వారా సరఫరా చేసే నీరు బురదగా వస్తున్నాయని తాగడానికి ఏ మాత్రం పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



తణుకులో సీపీఐ తణుకు పట్టణ 16వ మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి భీమారావు

తణుకు అర్బన్: అధికారమే లక్ష్యంగా ఎన్నికల ముందు ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి వాటి అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ సీపీఐ శ్రేణులు నిరంతర పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో సీపీఐ పట్టణ సమితి సభ్యుడు బండి సత్యనారాయణ అధ్యక్షత నిర్వహించిన సీపీఐ తణుకు పట్టణ 16వ మహాసభలో ఆయన మాట్లాడారు. పేదరికం, దారిద్ర్యం లేని ఆర్థిక అసమానతలు కుల, మత విభేదాలు లేని సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా సీపీఐ ఆవిర్భవించిందని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ మతతత్వ విధానాలతో లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందన్నారు. దేశ సంపద అయిన లక్షల కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు అప్పనంగా కట్టబెడుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకిచ్చిన ఇళ్ల స్థలాలు హామీతో పాటు సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా సీపీఐ పతాకాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సికిలే పుష్పకుమారి ఆవిష్కరించగా, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు పార్టీ పట్టణ సమితి నిర్వహించిన మూడేళ్ల కార్యకలాపాల నివేదికను మహాసభలో ప్రవేశ పెట్టారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, జిల్లా సమితి సభ్యుడు మండల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నారుమడి వేసేముందు విత్తన శుద్ధి పాటించాలి



కొమరవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో రాజేంద్రప్రసాద్, రైతులు

తణుకు అర్బన్: నారుమడి వేసేముందు విత్తన శుద్ధి తప్పక పాటించాలని తణుకు మండల వ్యవసాయాధికారి కె.రాజేంద్రప్రసాద్ సూచించారు. తణుకు మండలం కొమరవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నారుమడి వేసే ముందు రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని సూచించారు. రైతు స్థాయిలో విత్తన శుద్ధికి పొడి విత్తన శుద్ధికి కార్బన్డిజం అనే మందును ఒక కేజీ విత్తనానికి 3 గ్రాముల చొప్పున, తడి విత్తన శుద్ధికి ఒక లీటరు నీటికి ఒక గ్రాము కలిపి ఒక కేజీ విత్తనాన్ని శుద్ధి చేసుకోవాలని అన్నారు. నారుమడిలోని ఎరువులు యాజమాన్యంలో భాగంగా 5 సెంట్ల నారు మడికి 6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ట్ ఎరువును దమ్ములో కలపాలని, అదేవిధంగా 2 కేజీల యూరియాను ఒక కేజీ మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువును నారుమడి వేసిన వారం రోజుల నుంచి పది రోజుల లోపు వేయాలని చెప్పారు. తణుకు మండలంలో 11,080 ఎకరాల్లో వరిసాగు జరుగుతుందని దీనికి సంబంధించి 554 ఎకరాలు నారుమడి అవసరం అవుతుందని ఇప్పటివరకు 309 ఎకరాల్లో నారుమడి పూర్తిచేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో అరుణ్‌కుమార్, గ్రామానికి చెందిన రైతులు పలా నాగేశ్వరరావు, రెల్లి పండు, దుడే నారాయణమూర్తి, గంటా సర్వారాయుడు పాల్గొన్నారు.

నారుమడులు సిద్ధం చేసుకోవాలి

ఆకివీడు: కాలువల్లోకి పంట నీరు చేరుకుందని, వర్షాలు కురుస్తుండటంతో రైతులు నారుమడులు సిద్ధం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.మధు మోహన్ చెప్పారు. మండలంలోని అజ్జమూరు, చినమిల్లిపాడు గ్రామాల్లో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన నాట్లు వేసి, సకాలంలో మాసూళ్లు పూర్తి చేసుకుంటే కోతల సమయంలో తుఫాన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉండదన్నారు. వెదజల్లు పద్ధతి మంచిదని తెలిపారు. అవకాశం ఉన్న భూముల్లో రైతులు వెదజల్లు పద్ధతి పాటించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని, సాగు పూర్తి అయ్యేవరకూ బిల్లులు, ట్యాగ్‌లు భద్రపరచాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో చల్లారావు, లక్ష్మీనారాయణ, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



కే.ఆదిత్య మణికంఠ



ఎంఎల్‌వీఎస్ బాలాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఎన్‌సీసీ విద్యార్థి కే.ఆదిత్య మణికంఠ ఆర్‌కే వ్యాలీ ఇరుపులపాయి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా, పాఠశాలలో పదో తరగతిలో ద్వితీయ స్థానం సాధించిన ఎన్‌సీసీ విద్యార్థి ఎం.ఎల్.వీ.ఎస్ బాలాజీ శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీలో సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు మైనం సత్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి కేవీ గణపతిరావులు వెల్లడించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఇరగవరం: మండలంలోని ఇరగవరం ఎంఆవో కార్యాలయంలో మంగళవారం విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేసినట్లు కడలి సత్యనారాయణ తెలిపారు. మండలానికి చెందిన ఆనందరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విద్యార్థులకు అందజేస్తున్న సామగ్రిని ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతో పాటు దాతలు అందజేస్తున్న సహకారాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదిగి పుట్టిన గ్రామానికి, చదివిన పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన మెటిరీయల్ కూడా అందజేశారు. పెన్మెత్స శ్రీరామ కృష్ణ, పెన్మెత్స సుబ్బరాజు, ఉపాధ్యాయులు వీఎస్ఆర్ మూర్తి, కె రామకృష్ణ, జె సుబ్బారావు, కె పాలేశ్వరరావు, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎంటి గాలేశ్వరరావు, వై జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సహాయం అందించడం అభినందనీయం

భీమవరం: పుట్టినరోజులు, పెళ్లి రోజు వేడుకలను బంధువులు, స్నేహితులతోనూ నిర్వహించుకోవడంకంటే సమాజంలోని అభాగ్యుల మధ్య నిర్వహించుకునే వారికి సహాయం అందించడం అభినందనీయమని భీమవరం ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పస్తుల రామకృష్ణ అన్నారు. భీమవరం పట్టణానికి చెందిన భూపతి రాజు వెంకటనారాయణరాజు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం గొల్లవానితిప్ప రోడ్‌లోని ప్రకాష్‌నగర్ కాలనీలో పేదలకు భోజనాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న మామిడి దాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక బోర్డు, ప్రభుత్వం భాగస్వామ్యంతో భవన నిర్మాణ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పింఛన్ సౌకర్యాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశం స్థానిక కార్యాలయంలో మంగళవారం ఉదయం యూనియన్ అధ్యక్షుడు బండి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఐఎఫ్‌టీయూ నాయకులు దాన వర ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు పాటుపడాలన్నారు. నిధులను ఏ ప్రభుత్వాలు వాడుకోకూడదని, తిరిగి బోర్డుకు జమ చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చెప్పిన చంద్రబాబు, లోకేష్‌లు, పవన్ కల్యాణ్‌లు అధికారం చేపట్టి సంవత్సరమైన ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. ఓబీసీ కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండి దుర్గా ప్రసాద్, జమిందార్ చంద్రశేఖర్, దేవాబత్తుల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనే మరమ్మతులు



విస్సాకోడేరు 165 జాతీయ రహదారిలో వర్షంలో మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో165 జాతీయ రహదారి పాడై గోతులమయంగా మారడంతో నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు ప్రమాదాలకు గురవడంతో గతంలో మరమ్మతులకు నోచుకోని రోడ్లు వాహనదారులు విన్నవించుకున్నా అధికారుల్లో గానీ, పాలకులలలో గాని చలనం లేదు. అయితే ఈ రెండు మూడు రోజుల నుంచి వర్షం కురవడంతో రోడ్డు విపరీతంగా ఛిద్రమవ్వడంతో అధికారులు మరమ్మతులు చేపట్టే కార్యక్రమానికి పూనుకున్నారు. విచిత్రం ఏమిటంటే మొన్నటి వరకు భీకరమైన ఎండలు కాసిన సమయంలో మరమ్మతులు చేయడం మానేసి వర్షం పడుతున్నప్పుడు చేస్తుండడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంగా ఉన్న ఈ రోడ్డు మరమ్మతులను వర్షంలో చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం



భీమవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

భీమవరం: మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ పోలీస్‌ఈగల్ శాఖ , వరల్డ్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో భీమవరంలో మంగళవారం ఝాన్సీలక్ష్మీబాయి మున్సిపల్ హైస్కూల్లో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఏపీ చైర్మన్ పరిపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుష్ప్రభావలపై విద్యాసంస్థల్లో తమ సంస్థ తరపున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన సామాజిక, మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయని అందువల్ల దేశ భవిష్యత్తును కృంగదీసే మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికట్టాలన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వేతన యాతన

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా జీతాలు పెంచలేదని ఆవేదన



ఉండిలో ఆవేదన తెలుపుతున్న వీఆర్‌ఏలు

ఉండి: కూటమి ప్రభుత్వం ఏడాదైనా తమ వేతన విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడం వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాల్సి ఉన్నా ఇప్పటి దాకా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రెవెన్యూ శాఖ ద్వారా రాష్ట్రం లేదా కేంద్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా గ్రామస్థాయిలో అది విజయవంతం కావాలంటే దానికి విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌ల కీలకంగా ఉంటారు. జిల్లా కలెక్టర్ నుంచి గ్రామస్థాయి వీఆర్వో వరకు ఏ పని జరగాలన్నా దానికి కావాల్సింది వీఆర్‌ఏలే. రాత్రీ,పగలు తేడా లేకుండా ఎప్పుడు బడితే అప్పుడు డ్యూటీలు వేస్తే మారు మాట్లాడకుండా ఎంత దూరాభారమైనా వెళ్ళి రావల్సిందే తప్ప ఇదేంటి అని అడిగే అధికారం ఉండదని వీఆర్‌ఏలు వాపోతున్నారు. టైం జాబ్‌గా ప్రారంభమై ఇప్పుడు సమయమే లేని ఉద్యోగంగా తయారైంది. ఎప్పుడు పిలిచినా రావాలి, ఏం చెప్పినా చేయాలనే చందాన అధికారులు వ్యవహరిస్తున్నారని వివరిస్తున్నారు. రోజుకు రూ.370 భత్యంతో నెలకు రూ.10,000 నుంచి రూ.11085 జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. పేస్కేల్ అమలు చేసి ప్రతీ నెల రూ.18000 జీతం ఇవ్వాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

సిబ్బంది తక్కువ పని ఎక్కువ

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వీఆర్ఏల కొరత తీవ్రంగా ఉంది. మండలానికి కనీసం 40 మంది మంది వీఆర్‌ఏలు ఉండాల్సి వుండగా కేవలం 13 నుంచి 35 మంది వరకు మాత్రమే వీఆర్‌ఏలు ఉన్నారు. మండల వ్యాప్తంగా రీ-సర్వే, రేషన్‌కార్డుల సర్వే, రెవెన్యూ కార్యక్రమాలు ఇతరమైన ఏ పనులు ఉన్నా వీరితోనే చేయించయడం

వివరాలు

మండలం	గ్రామాలు	ఉండాల్సిన వీఆర్‌ఏలు	ఇప్పుడు నివేస్తున్న సంఖ్య
ఉండి	19	50	35
ఆకివీడు	16	72	13
కాళ్ళ	21	50	25

తో తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారు. తమ పని తాము చేసుకోవమే చాలా కష్టంగా ఉందని ఇప్పుడు రీసర్వే పేరుతో ఇతర గ్రామాలకు కూడా పంపించి పని చేయిస్తున్నారని దానివల్ల మాకు కనీస ప్రతిఫలం లేదని వారు వాపోతున్నారు.

మంత్రి లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చినా

ఈ ఏడాది ప్రథమార్థంలో ఉండి జెడ్పీ హైస్కూల్‌కు విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వీఆర్‌ఏల సంఘ ప్రతినిధులు తమ బాధలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు చెబుతున్నారు. అయితే దానిపై ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేకపోవడంతో వీఆర్‌ఏలు తీవ్ర ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు వీఆర్‌ఏలకు న్యాయం చేస్తామని ఆనాటి కూటమి నాయకుల వాగ్దానాలు నమ్మి మోసపోయామని వారు ఆవేదని చెందుతున్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచాలని కోరుతున్నారు.

మా బతుకులు ఇంతేనా?



తాత, నాన్న,నేను ఇలా ఒకరి తరువాత ఒకరం ఈ ఉద్యోగాన్నే నమ్ముకుని బతుకుతున్నాం. తరాలు మారుతున్నా ఉద్యోగంలో మార్పులేదు. జీతంలో లేడా లేదు. సగటు మనిషి బతకాలంటే ఎంత జీతం కావాలో ప్రభుత్వ పెద్దలకు తెలుసు. దాని ప్రకారం మాకు న్యాయం చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

– ఎం నాగరాజు, వీఆర్‌ఏ, ఉండి

ప్రమోషన్‌లు ఇవ్వాలి



కూటమి ప్రభుత్వంలో మాకు తగిన గుర్తింపు ఇవ్వాలి. వీఆర్‌ఏలుగా ఎన్నో ఏళ్ల సీనియారిటీ కలిగిన వారిని గుర్తించి ప్రభుత్వం మాకు పదోన్నతులు కల్పించాలి. డీఏలు ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి. చాలీచాలని జీతంతో కుటుంబం గడవాలంటే కష్టం ఉంది. ఇప్పటికైనా మా జీతాలు పెంచాలి.

– ముత్యాలపల్లి గేణేష్, వీఆర్‌ఏ, ఎన్నార్పీ అగ్రహారం

పేస్కేల్ అమలు చేయాలి



ఏళ్లకు ఏళ్లుగా గ్రామాలకు సేవలు చేశాం. ప్రభుత్వాలు మారుతున్నా మా తలరాతలు మారడం లేదు. మాకు తగిన గుర్తింపు ఇచ్చి మాకు పేస్కేల్ అమలు చేసి మాకు జీతాలు ఇవ్వాలి. మాకు కనీసం రూ.18000 నెలకు జీతం ఇవ్వాలి. అత్యంత నిరుపేదలుగా మిగిలిపోతున్న మాపై ప్రభుత్వం దయ చూపాలి.

– బి.సుల్తాన్‌బాషా,వీఆర్‌ఏ, పెదపుల్లేరు.

సచివాలయ బదిలీలు పారదర్శకంగా చేయాలి

ఉండి: సచివాలయాల్లో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరగాలని (ఏపీజీఈఏ) ఉద్యోగసంఘ నాయకులు తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో స్థానిక(నేటివ్) మండలంలో బదిలీలకు ఆప్షన్ కల్పించాలని కోరారు. రేషనలైజేషన్ పారదర్శకంగా అమలు చేయాలని మిగులు సిబ్బందికి సంబంధించి స్పష్టమైన విధివిధానాలు జారీ చేయాలని కోరారు.

ఎస్ఎస్ఏలోని రీప్లేస్‌మెంట్ ప్రొవిజనల్ సీనియార్టీ లిస్ట్ ప్రదర్శన

భీమవరం: సమగ్రశిక్ష ప్రాజెక్ట్‌లోని కాంట్రాక్ట్ సిబ్బంది రీప్లేస్‌మెంట్ ప్రొవిజనల్ సీనియార్టీ లిస్ట్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జిల్లా విద్యాశాఖాధికారి నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి శ్యామ్‌సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియార్టీలిస్ట్‌పై ఎమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 27వ తేది లోపుగా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కార్యాలయంలో అందజేయాలని శ్యామ్‌సుందర్ తెలిపారు.

రేపు పెనుగొండలో జాబ్‌మేళా

పెనుగొండ: స్థానిక విశ్వతేజ డిగ్రీ కళాశాలలో 1ఎం1బీ సమన్వయంతో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు 1ఎం1బీ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ జాన్‌తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ, సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా ఫౌండేషన్ కృషి చేస్తుందని వివరించారు.